నమస్తే తెలంగాణ
# నిర్మల్
3 | నిజామాబాద్, శనివారం 6 ఏప్రిల్ 2024 | NIRMAL

## ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి



కలెక్టరేట్‌లో జగ్జీవన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్

నిర్మల్ టౌన్, ఏప్రిల్ 5: మాజీ ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జయంతిని శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ముందుకు తీసుకెళ్లాలని పిలుపు నిచ్చారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, అధికారులు రాజేశ్వర్ గౌడ్, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## వెంటనే వినియోగంలోకి తేవాలి

**నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**



బోరిగాంలోని గోదామును పరిశీలిస్తున్న కలెక్టర్ అశీష్ సంగ్వాన్

లక్ష్మణచాంద, ఏప్రిల్ 5: గోదాం నిర్మాణ పనులు పూర్తి చేసి, వెంటనే వినియోగంలోకి తేవాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పేర్కొన్నారు. మండలంలోని బోరిగాం గ్రామంలో గోదాంను శుక్రవారం పరిశీలించారు. గోదాంలో వే మిషన్, ఇతర పనులను వెంటనే పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, కాంట్రాక్టర్ జగన్మోహన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



ఓలాలో వ్యవసాయ గోదామును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

## నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

**నిర్మల్ అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**

కుంటాల, ఏప్రిల్ 5 : పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. మండలంలోని ఓలాలో రూర్బన్ పథకంలో భాగంగా రూ. 40 లక్షలతో నిర్మించిన వ్యవసాయ గోదాంను శుక్రవారం పరిశీలించారు. గ్రామంలోని నర్సరీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు, అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామ పంచాయతీలోని రికార్డులను పరిశీలించారు. ఇంటి పన్నులను సకాలంలో వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఎంపీపీ గజ్జారాం, ఎంపీటీసీ కట్ట రవి, డీఈ సురేశ్, డీఆర్‌డీఏ సూపరింటెండెంట్ శ్రీనివాస్, జీపీ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో రహీం, ఏపీవో నవీన్, పంచాయతీ కార్యదర్శి యోగేశ్ తదితరులున్నారు.

## చెక్‌పోస్టు వద్ద తనిఖీలు

లక్ష్మణచాంద, ఏప్రిల్ 5: మండలంలోని కనకాపూర్ గ్రామంలోని చెక్‌పోస్టు వద్ద సీఐ నవీన్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. పీచర గ్రామానికి చెందిన పోచంపల్లి రఘునందన్ కారులో ఉన్న రూ. లక్షా నలభై నాలుగు వేలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న నగదును కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీకి అందజేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఏఎస్‌ఐ నారాయణ రెడ్డి, పోలీస్ హెడ్ కానిస్టేబుల్ గంగాధర్, కానిస్టేబుల్ అశోక్ పాల్గొన్నారు.

భైంసాటౌన్, ఏప్రిల్ 5 : మండలంలోని మీర్జాపూర్ వద్ద పోలీసులు శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా దెగ్లూర్ నాకాకు చెందిన అరుణ్ కలామ్ ఖురేషి తన వాహనం (ఎంహెచ్ 26 7155)లో అటుగా వెళ్తుండగా ఆపారు. ఈ క్రమంలో వాహనంలో రూ. 3.20 లక్షలు లభించాయి. సరైన ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు రూరల్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## ఓటరుగా నమోదు చేసుకోవాలి

**ఆదిలాబాద్ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతో**

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 5: 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆదిలాబాద్ అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. బజార్‌హత్నూర్‌లో ఓటరు గైడ్ అవగాహన ర్యాలీని శుక్రవారం యువకులు, ఆయా శాఖల అధికారులు, ప్రజలతో కలిసి నిర్వహించారు. ఓటు హక్కుపై ప్రజలకు ఇంటింటికీ వెళ్లి అధికారులు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ వికాస్ మహతో ఓటర్లతో మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. స్థానిక పాత బస్టాండ్ సమీపంలో గ్రామస్తులు, అధికారులు, యువకులు కలిసికట్టుగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌డీవో నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేకాధికారి మోహన్ నాయక్, తహసీల్దార్ శంకర్, ఎంపీడీవో శ్రీనివాస్, వైద్యాధికారి భీంరావ్, ఎస్‌ఐ నరేశ్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్, ఐకేపీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



బజార్‌హత్నూర్‌లో మానవహారం నిర్వహించి ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజలు

# ప్రభుత్వ ఆఫీసుల పన్నులేవీ ?

**బల్దియాలకు ప్రభుత్వ కార్యాలయాలు కట్టాల్సిన బకాయిలు రూ.10.4 కోట్లు**

- మార్చి 31 నాటికి రూ.16.17 కోట్లలో వసూలైనవి రూ.5.77 కోట్లే
- నస్పూర్ మున్సిపాలిటీకి రూ.1.10 కోట్లు కట్టాల్సిన సింగరేణి
- ఆదిలాబాద్‌లో రూ.4.11 కోట్లు బకాయిపడ్డ ప్రభుత్వాఫీసులు
- నిర్మల్‌లో రూ.2.50 కోట్లు, మంచిర్యాలలో రూ.1.70 కోట్లు..

మంచిర్యాల, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ప్రజల నుంచి ముక్కుపిండి పన్నులు వసూలు చేసే అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల నుంచి బల్దియాలకు వచ్చే ఆస్తి పన్ను బకాయిలపై మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఏండ్లకేండ్లు కోట్లలో పేరుకుపోతున్నా, సేకరించడంలో విఫలమవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గత నెలలో వసూలు చేసిన ఆస్తిపన్నుతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మున్సిపాలిటీలకు ఆదాయం పెరిగింది. జిల్లాలోని 12 మున్సిపాలిటీలకు రూ.58.90 కోట్లు పన్నుల రూపంలో సమకూరాయి. సాధారణంగా పురపాలికలకు నల్లా పన్ను, దుకాణాల అద్దె, వర్తక పన్ను, వాణిజ్య ప్రకటనలపై వచ్చే ఆదాయం కన్నా.. ఆస్తిపన్ను రూపంలో వచ్చే ఆదాయమే ఎక్కువ. అందుకే సకాలంలో పన్ను కట్టకపోతే ఎక్కడ మెలిక పెట్టాలో అక్కడ పెట్టి మరీ వసూలు చేస్తారు. ఎందుకంటే మున్సిపాలిటీల ఖర్చులు దీనిపైనే ఆధారపడి ఉంటాయి. ఒక్క ఏడాది పన్ను వసూలు కాకుండా బకాయిలు పేరుకపోయాయా.. ఇక అంతే సంగతులు. అభివృద్ధి పనులు నిలిచిపోవడంతో పాటు బిల్లుల చెల్లింపులు, సిబ్బంది, కార్మికుల వేతనాలు కష్టమైపోతాయి. అందుకే మొండి బకాయిల విషయంలో అధికారులు, సిబ్బంది కఠినంగా వ్యవహరిస్తుంటారు. ఇటీవల నిర్మల్ జిల్లాలో పన్ను బకాయిలున్న ఇండ్ల గేట్లను మున్సిపాలిటీ వాళ్లు తీసుకెళ్లిపోయారు. ఖాళీ స్థలాలు ఉండి మొండి బకాయిలుంటే స్థలం అమ్ముకునేప్పుడో, ఇంటి నిర్మాణ సమయంలోనే పర్మిషన్‌కు ఆస్తి పన్నుకు మెలికపెట్టి మరీ వసూలు చేస్తుంటారు. అందుకే ఉమ్మడి జిల్లాలో రూ.100.29 కోట్ల లక్ష్యంలో దాదాపు 60శాతం వసూళ్లు చేయగలిగారు. ఇక్కడికి వరకు బాగానే ఉన్నా ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన పన్నులు మాత్రం మున్సిపాలిటీలకు రాకపోవడం గమనార్హం.

### ప్రభుత్వ బకాయిలు రూ.10.4 కోట్లు

సాధారణ జనాలు పన్నులు కట్టని పక్షంలో కఠినంగా వ్యవహరించే అధికారులు ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే సరికి మాత్రం ఏమి చేయలేకపోతున్నారు. ఏండ్లకేండ్లు ఆస్తి పన్ను బకాయిలుంటున్నా, వసూలు చేయడంలో విఫలమవుతున్నారు. ఉమ్మడి జిల్లాకు ఉన్న రూ.100.29 కోట్ల లక్ష్యంలో వసూలైన మొత్తం తీసేస్తే ఇంకా రూ.41.39 కోట్లు కట్టాల్సి ఉంది. ఈ బకాయిల్లో 40 శాతం అంటే రూ.16.17 కోట్లు ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సి ఉండగా, రూ.5.77 కోట్లు వసూలయ్యాయి. ఇంకా రూ. 10 కోట్ల పైచిలుకు పన్నులు వసూలు కాలేదు. ఇవన్నీ ఈ ఒక్క ఆర్థిక సంవత్సరానికి కాదు.. ఏండ్లకు ఏండ్లుగా కట్టకుండా పేరుకుపోయిన బకాయిలే. సింగరేణి సంస్థ రూ.1.10 కోట్లు నస్పూర్ మున్సిపాలిటీకి బకాయిపడింది. అత్యధికంగా ఆదిలాబాద్ మున్సిపాలిటీలో 756 ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.8.49 కోట్ల పన్నులు రావాల్సి ఉండగా, ఈ ఏడాది రూ.4.38 కోట్లు వసూలయ్యాయి. నిర్మల్ మున్సిపాలిటీకి ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.3 కోట్లు రావాల్సి ఉండగా, రూ. 50 లక్షలు, మంచిర్యాల మున్సిపాలిటీకి రూ.1.83 కోట్లకు రూ.12.37 లక్షలు మాత్రమే వచ్చాయి. ఇలా ఉమ్మడి జిల్లాలో మొత్తం 12 మున్సిపాలిటీల్లో ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.5.77 కోట్ల పన్నులు మాత్రమే వసూలు అయ్యాయి. ఒక్క క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఎలాంటి బకాయిలు లేవు.

### టాప్‌లో లక్షెట్టిపేట మున్సిపాలిటీ..

పన్నుల వసూళ్లలో తెలంగాణ రాష్ట్ర సగటు 70.34శాతంగా ఉండగా, ఉమ్మడి జిల్లాలో ఈ మార్క్‌ను కేవలం రెండు మున్సిపాలిటీలు మాత్రమే దాటగలిగాయి. లక్షెట్టిపేట మున్సిపాలిటీ రికార్డు స్థాయిలో 91.44 శాతం పన్నులు వసూలు చేసింది. రాష్ట్రంలోనే ఈ మున్సిపాలిటీ టాప్-8లో నిలిచింది. ఉమ్మడి జిల్లాలో లక్షెట్టిపేట మొదటిస్థానంలో ఉండగా, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ 80.17శాతంతో రెండో స్థానంలో ఉంది. మన జిల్లాలోని భైంసా 47.29 శాతంతో రాష్ట్రంలోనే అట్టడుగున ఉంది. మంచిర్యాల 68.45 శాతం, ఆదిలాబాద్ 64.23 శాతం, కాగజ్‌నగర్ 58.16, నస్పూర్ 56.52, చెన్నూర్ 55.94, నిర్మల్ 53.24, మందమర్రి 53.20, బెల్లంపల్లి 50.79 మాత్రమే 50 శాతం మార్కును దాటి ఆస్తిపన్నులు వసూలు చేయగా, ఖానాపూర్ మున్సిపాలిటీ 49.06శాతం పన్నులు వసూలు చేసింది.



నిర్మల్‌లో ఆస్తిపన్ను కట్టకపోవడంతో ఇంటి గేట్లు ఎత్తుకెళ్తున్న మున్సిపల్ సిబ్బంది(ఫైల్)

**నోట్: ఈ టేబుల్ రూపాయలు కోట్లలో ఇచ్చాం. లక్షల్లో ఉన్న దగ్గర స్పష్టంగా మెన్షన్ చేశాం.**

**మున్సిపాలిటీ వారీగా వసూలైన పన్ను, ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన పన్ను వివరాలు ఇలా..**

| మున్సిపాలిటీ | ఇప్పటి వరకు వసూలైన పన్ను | ఇంకా వసూలు కావాల్సినవి | ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సినవి | ఇప్పటి వరకు వసూలైనవి |
|---|---|---|---|---|
| ఆదిలాబాద్ | 8.42 | 3.04 | 8.49 | 4.38 |
| నిర్మల్ | 6.18 | 4.75 | 3.00 | 50,00,000 |
| మంచిర్యాల | 12.04 | 7.21 | 1.83 | 12,37,000 |
| నస్పూర్ | 2.88 | 2.10 | 1.10 | 00 |
| భైంసా | 2.91 | 2.99 | 60,51,000 | 00 |
| చెన్నూర్ | 14.44 | 10.68 | 36,20,000 | 00 |
| ఖానాపూర్ | 92,00,000 | 27,00,000 | 23,26,000 | 10,33,000 |
| బెల్లంపల్లి | 2.41 | 1.04 | 22,00,000 | 16,00,000 |
| కాగజ్‌నగర్ | 2.33 | 1.58 | 20,00,000 | 4,30,000 |
| మందమర్రి | 1.60 | 53,56,000 | 10,18,000 | 5,06,000 |
| లక్షెట్టిపేట | 1.40 | 7,58,000 | 3,71,000 | 88,568 |
| క్యాతన్‌పల్లి | 3.37 | 7.12 | 25,000 | 25,000 |
| మొత్తం | 58.90 | 41.39 | 16.17 | 5.77 |

### వడ్డీ మీద 90 శాతం రాయితీ కలిసివచ్చింది



*ఆస్తి పన్ను వసూలు కోసం మార్చి 31వ తేదీ డెడ్‌లైన్ పెట్టుకొని పనిచేశాం. విస్తృత ప్రచారం నిర్వహించడం, బకాయిలు తగ్గించేందుకు వడ్డీ మీద 90శాతం రాయితీ ఇవ్వడం కలిసి వచ్చింది. చాలా మంది ఈ సదుపాయాన్ని ఉపయోగించుకున్నారు. మంచిర్యాలలో 68.45 శాతం పన్నులు వసూలయ్యాయి. ఇంకా కట్టనివాళ్లు ఎవరైనా ఉంటే వెంటనే కట్టాలి. మొండి బకాయిలు ఎప్పటికైనా ప్రమాదకరమే. బకాయిల వసూళ్లపై దృష్టి సారించాం. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు మొండి బకాయిల విషయంలో తగిన చర్యలు తీసుకుంటాం. ఎర్లీబర్డ్ స్కీమ్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అడ్వాన్స్‌గా ఆస్తి పన్ను చెల్లించే వారికి 5 శాతం రాయితీ వర్తిస్తుంది. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకొని, ముందస్తు పన్నులను 5 శాతం రాయితీతో చెల్లించాలి.*

**- ఏ. మారుతి ప్రసాద్, మున్సిపల్ కమిషనర్, మంచిర్యాల**

# నేడు రైతు దీక్ష

- కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా నిర్వహణ
- ఎన్నికల హామీలు ఆ పార్టీ నెరవేర్చాలి
- అన్నదాతలను వెంటనే ఆదుకోవాలి
- మాజీ మంత్రి జోగు రామన్న



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఆదిలాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు శనివారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో రైతు దీక్ష చేపడుతున్నట్లు మాజీ మంత్రి జోగు రామన్న తెలిపారు. బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కాంగ్రెస్ పార్టీ నెరవేర్చలేదని విమర్శించారు. ఆ పార్టీ ఇచ్చిన 420 హామీల్లో రైతులకు సంబంధించినవి 31 ఉన్నట్లు తెలిపారు. నేడు తుక్కుగూడలో బహిరంగ సభ నిర్వహించి పార్లమెంట్ ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల చేస్తున్న కాంగ్రెస్ ప్రజలను రెండోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నదన్నారు. రైతు భరోసా పథకంలో భాగంగా ఎకరాకు రూ. 15 వేలు ఇస్తామని ప్రకటించిన హస్తం పార్టీ, మొండిచేయి చూపిందని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బంధు డబ్బులను కూడా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా డిసెంబర్ 9న రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినా, ఇప్పటివరకు దానిపై ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. రైతులు పండించిన ప్రతి పంటకు మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లించి కొనుగోలు చేస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారని, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని ప్రకటించినా దేనికి దిక్కులేదని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ పర్యటనలకు భయపడి ప్రభుత్వం ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తున్నదని తెలిపారు. రైతులకు 24 గంటల విద్యుత్ సరఫరా కావడం లేదని మండిపడ్డారు. ఆదిలాబాద్ జిల్లాలో సోయాబీన్, శనగ పంటలను రైతులు 80 శాతం ప్రైవేటు వ్యాపారులకు విక్రయించిన తర్వాత అధికారులు నామ్‌కే వాస్తేగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. జిల్లాలో 30 వేల ఎకరాల్లో జొన్న పంట సాగవుతున్నదని రైతులు నష్టపోకుండా ప్రభుత్వం మద్దతు ధరతో పాటు బోనస్ చెల్లించి పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా రైతులు భారీగా పంటలను నష్టపోయినా ప్రభుత్వంలో కనీస స్పందన లేదని, పంటలకు ఎకరాకు రూ.25 వేల పరిహారం చెల్లించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ ఝూటా పార్టీలని, ప్రజలు ఆ పార్టీ నాయకుల మాటలు నమ్మవద్దని సూచించారు. నేడు జరిగే రైతుదీక్షలో పార్టీలకతీతంగా రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, నాయకులు ఆలాల అజయ్, విజ్జిగిరి నారాయణ, జగదీశ్, శ్రీనివాస్, వేణు, అశ్రఫ్, రాజన్న, తదితరులు పాల్గొన్నారు.



అమ్మ ఆదర్శ పాఠశాల పనులపై పీఆర్ శాఖ అధికారులతో చర్చిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా

## తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తాం

**ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా**



రాంజీగూడ వద్ద ఉన్న బావిని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 5: వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తామని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండలంలోని బుర్సన్‌పటార్, రాంజీగూడ గ్రామాలను శుక్రవారం సందర్శించారు. రాంజీగూడలో బావిని పరిశీలించారు. తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించారు. బుర్సన్‌పటార్ వరకు ఉన్న పైపులైన్ మరమ్మతులపై అధికారులకు పలు సూచనలు చేశారు. కోడ్ రాకముందు మంజూరైన రూ. 5 లక్షలతో పైపులైన్‌కు మరమ్మతులు చేసి బుర్సన్‌పటార్ గ్రామస్తులకు తాగునీటిని అందించాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామానికి నీటిని సక్రమంగా అందించడానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు వినతులు చేయగా, సానుకూలంగా స్పందించి అధికారులకు ఆదేశాలిచ్చారు. పిల్లలను బడికి పంపించాలని, మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో సాయన్న, ఉట్నూర్ ఆర్డీవో జీవకర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేశ్, డీఈ శ్రీనివాస్, ఎస్‌ఐ డీ సునీల్, ఏఈ భానుకుమార్, పీఆర్ ఎస్ ఏఈ లింగన్న, గిర్దవార్ మెస్రం లక్ష్మణ్, ఎంఈవో నారాయణ, ఐకేపీ ఏపీఎం రామారావ్, ఐకేపీ సీసీ బామ్నే శ్రీరాం, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రామారావు, పాఠశాల హెచ్‌ఎం విజయలక్ష్మి, ఈవో సంజీవరావు, జీపీ కార్యదర్శి నాందేవ్, గ్రామస్తులు పీరాజీ, సూర్యకాంత్, విలాస్, గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బతో వివాహిత మృతి



స్వర్ణలత(ఫైల్)

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 5: నిర్మల్ పట్టణంలోని జీఎన్‌ఆర్ కాలనీకి చెందిన స్వర్ణలత (45) వడదెబ్బతో అస్వస్థతకు గురై గురువారం రాత్రి మృతి చెందింది. రెండు రోజుల క్రితం ఆమె బంధువుల వివాహానికి నిజామాబాద్‌కు వెళ్లింది. ఈ క్రమంలో వడదెబ్బకు గురై వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురైంది. గురువారం రాత్రి పరిస్థితి విషమించడంతో దవాఖానకు తీసుకెళ్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందింది. వీరిది ముథోల్ కాగా, ఐదేండ్ల నుంచి నిర్మల్ పట్టణంలోని జీఎన్‌ఆర్ కాలనీలో ఉంటున్నారు. భర్త గంగాధర్, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

## 62 మందికి షోకాజ్ నోటీసులు

**నేటిలోగా హాజరవ్వాలని ఆదేశాలు**

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 5: పదో తరగతి స్పాట్ (మూల్యాంకనం) విధులకు హాజరు కాని 62 మంది స్పెషల్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ అయ్యాయి. నిర్మల్ జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో వీరు రిపోర్ట్ చేయని కారణంగా వారికి శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు క్యాంపు ఆఫీసర్, డీఈవో రవీందర్ రెడ్డి తెలిపారు. కాగా, నోటీసులు అందుకున్న వారందరూ శనివారం ఉదయం 9 గంటలలోపు మూల్యాంకన కేంద్రంలో హాజరవ్వాలని ఆదేశించారు. లేకుంటే వేతనం నిలిపివేస్తామని హెచ్చరించారు. మూల్యాంకనం ఈ నెల 13వ తేదీన ముగుస్తుందని తెలిపారు.